క్లుప్తంగా

ప్రపంచ జనాభా దినోత్సవంపై ర్యాలీ



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని నుదురుపాడు ఆరోగ్యకేంద్రం, ఫిరంగిపురం ఆరోగ్య కేంద్రాల వద్ద మంగళవారం ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ర్యాలీలు నిర్వహించారు. వైద్యురాలు ఎస్తేరురాణి మాట్లాడుతూ రోజురోజుకు ప్రపంచ జనాభా పెరుగుతుందని చెప్పారు. దీనివల్ల అనేక దేశాలల్లో ఆర్థికంగా, ఆహార పరంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిపారు. బిడ్డ, బిడ్డకు ఎడం పాటించాలని చెప్పారు. జనాభా నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటలక్ష్మి, ఎంపీహెచ్ఈవో లూర్దురాజు, పీహెచ్ఎన్ గాయత్రీదేవి, హెచ్‌వీలు ఖాజాబీ, అన్నమేరి, ఎంపీహెచ్ఎస్ కె.సుదర్శన్‌రాజు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యర్రబాలెంలో స్వర్ణకారుని అదృశ్యం



స్వర్ణకారుడు సింహాద్రి రవి (ఫైల్)

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో ఓ స్వర్ణకారుడు అదృశ్యమయ్యాడు. మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. యర్రబాలెంకు చెందిన సింహాద్రి రవి స్వర్ణకార్మికునిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లిన రవి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు స్థానికులు, బంధువులను విచారించినా ఆచూకీ లభించలేదు. మంగళవారం రవి భార్య శిరీష తన భర్త అదృశ్యమైనట్లు మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లైసెన్స్ లేకుండా ఆటోలు నడిపితే కేసు నమోదు చేస్తాం



మేడికొండూరు: ఆటో నడిపే ప్రతి ఒక్కరూ విధిలా లైసెన్సు కలిగి ఉండాలని, లేనివారిపై కేసు నమోదు చేస్తామని మేడికొండూరు సీఐ కె.వాసు అన్నారు. మేడికొండూరు పోలీసుస్టేషన్‌లో ఆటో యూనియన్ నాయకులు, యజమానులతో మంగళవారం సమావేశమయ్యారు. ఆటోకు సంబంధించి రికార్డులు, లైసెన్సు తమతోపాటు ఉంచుకోవాలన్నారు. పోలీసు వారు సీరియల్ నంబరు వేయడం జరుగుతోందన్నారు. ఆటోలో నంబరు ప్లేటు కనబడేలా అమర్చాలని, వాటిపై ఎలాంటి రాతలు రాయకూడదన్నారు. మండల పరిధిలోని ఆటో నడిపే ప్రతి వాహనదారుడు సంబంధి పత్రాలు పోలీసు స్టేషన్‌లో సమర్పించాలన్నారు. ఇలా చేయడం వల్ల నేరాలు అదుపులో ఉంటాయన్నారు. అనుమానంగా తిరిగే ఆటోల కదలికలు గమనించవచ్చన్నారు. సమావేశంలో హెడ్ కానిస్టేబుల్ సైదా, పోలీసు సిబ్బంది, ఆటో డ్రైవర్లు, యజమానులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

పలువురికి రూ.4.50 లక్షల జరిమానా



తాడికొండ: తాడికొండలో మంగళవారం విద్యుత్ విజిలెన్స్ విభాగం అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో అధిక లోడు వాడుతున్న 113 మందితోపాటు విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 18 సర్వీసులను గుర్తించి సుమారుగా రూ.4.50 లక్షల జరిమానా విధించినట్లు విద్యుత్ నిఘా విభాగం డీపీఈ విభాగం ఈఈ కేవీఎల్ఎస్ మూర్తి, ఈఈ ఆపరేషన్స్ టీవీ తులసీరామ్ తెలిపారు. ఏపీటీఎస్ పోలీస్ సహకారంతో 42 బృందాలుగా విడిపోయి ఈ తనిఖీలు నిర్వహించినట్లు వారు తెలిపారు. వారు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని ఎవరైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతుంటే 8331021847, 8331024029 నంబర్‌లకు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి కనుక ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. విద్యుత్ ఏఈ రవికుమార్, సబ్ ఏఈ నాగరాజు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సింగిల్ నంబరు లాటరీ కేసులో ఇద్దరి అరెస్ట్

గుంటూరు ఈస్ట్: సింగిల్ నంబరు ఆట నిర్వహిస్తున్న ఇద్దరిపై అరండల్‌పేట కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. డొంకరోడ్డులో సింగిల్ నంబరు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో మంగళవారం దాడి చేశారు. మల్లిబోయిన శ్రీను, ఊటుకూరి ఏసుబాబులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వీరి నుంచి రూ.2 వేలు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలన్నదే సురక్ష లక్ష్యం

- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)
- ఆత్మకూరులో జగనన్న సురక్ష కార్యక్రమం



ధ్రువీకరణ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలన్న లక్ష్యంతో ప్రారంభించినదే జగనన్న సురక్ష పథకం అని ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి(ఆర్కే) అన్నారు. నగర పరిధిలోని ఆత్మకూరు సచివాలయం-1లో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి పాల్గొని ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ సచివాలయ పరిధిలో 1748 నివాసాలు ఉండగా వివిధ సమస్యలపై 814 వినతులు వచ్చాయని రెండు మాత్రమే తిరస్కరించబడ్డాయన్నారు. వారికి కూడా సహేతుకమైన వివరణతోపాటు ధ్రువీకరణ పత్రాలు అందించడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఆత్మకూరుకు ప్రభుత్వం సంక్షేమం కోసం రూ.17 కోట్లు, అభివృద్ధి పనుల కోసం రూ.20 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఎక్కడా అవినీతి లేకుండా రోడ్లు, డ్రెయిన్‌లు, తాగునీరు, శ్మశానవాటికలను అభివృద్ధి పర్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏ విధంగా పనిచేస్తున్నారో ప్రజలు గుర్తించి అండగా నిలవాలన్నారు. తొలుత పంచాయతీ కార్యాలయం వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ మునగాల భాగ్యలక్ష్మి, డీఈ కష్టారెడ్డి, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సీతామహాలక్ష్మి, మాజీ సర్పంచ్ బొమ్ము శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: రాష్ట్రంలో సమసమాజం, సమానత్వం నెలకొల్పడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని బేతపూడి, రేపూడి గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన రాష్ట్రంలో కొనసాగుతోందన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం బేతపూడిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన హరిబాబు కుటుంబాన్ని పరామర్శించి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, పార్టీ మండల అధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి, సర్పంచులు చిట్టా అంజనీదేవి, జి.ఆదంబీ, డి.మెల్కియా, వైస్ ఎంపీపీ జి.చంద్రం, చిట్టా అంజిరెడ్డి, జి.మస్తాన్‌వలి, బద్దూరి శ్రీనివాసరెడ్డి, చిట్టా శ్రీనివాసరెడ్డి, దిలీప్ రెడ్డి, చిట్టా కృష్ణారెడ్డి, ఎం.సుధాకరరెడ్డి, ఖాజావలి, ఖాసింసాహిద్, జి.మస్తాన్‌వలి, వి.సుభాని, చిన్న సుభాని, ఇ.బాజి, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీవో డి.అనూరాధ, డిప్యూటీ తహసీల్దార్ రాజా రమేష్ మోహన్, కార్యదర్శులు గజేంద్రనాథ్, కోటేశ్వరరావునాయక్, బి.మధులు, లలితకుమారి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



బండారుపల్లిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్



సిరిపురంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి, జేసీ రాజకుమారి

పార్టీలకతీతంగా సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

బండారుపల్లి(తాడికొండ): అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మంగళవారం తాడికొండ మండలం బండారుపల్లి గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే ఉద్దేశంతో జగనన్న సురక్షా పథకాన్ని ప్రవేశపెట్టి ఇంటింటికీ సేవలందించే కార్యక్రమం రూపొందించారన్నారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో సమస్యలు లేని గ్రామాలుగా సంక్షేమం, అభివృద్ధి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సర్పంచ్ ముప్పాళ్ల మనోహర్, మాజీ ఎంపీపీ బండ్ల పున్నారావుతో కలిసి ఆయన లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ముప్పాళ్ల శ్రీనివాసరావు, ఎంపీడీఓ అత్తోట దీప్తి, డిప్యూటీ తహసీల్దార్ కాకుమాను ప్రసాద్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజా సమస్యల పరిష్కారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి : క్షేత్ర స్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అన్నారు. నగరంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో, కళావేదికలో మంగళవారం 17,19వ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి నవరత్నాలు, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. 11 రకాల ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ యు లక్ష్మీపతిరావు, డిప్యూటీ తహసీల్దార్ రమణరాజు, ఆర్ఐ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: అర్హులైన వారికి 100 శాతం సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ సీపీ లక్ష్యమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం దుగ్గిరాల మండలం ఈమని 1,2 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్న ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీడీవో కుసుమ శ్రీదేవి, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు దానబోయిన వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్ వీరయ్య, యార్డ్ చైర్మన్ షేక్ బాజి, జేసీఎస్ కన్వీనర్ శృంగారపాటి రత్నం, పిల్లి ధర్మరత్నం, మత్తె ఆనంద్, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, వలంటీర్లు గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిరూరల్: జగనన్న సురక్ష కార్యక్రమంలో 12 రకాల సేవలనే కాదు, రైతుల సమస్యలను కూడా పరిష్కరిస్తామని తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి అన్నారు. మంగళవారం పెనుమాకలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ ప్రజల నుంచి అభిప్రాయాలు తెలుసుకున్నారు. రైతుల నుంచి ఎక్కువ సమస్యలు వచ్చాయని, వాటిని సైతం పరిష్కరిస్తామని, సమస్యలు ఉన్న రైతులు వారి వారి పరిధిలోని వలంటీర్లకు అర్జీ రూపంలో అందిస్తే త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో డీఈ రెహమాన్, ఆర్ఓ మురళి, ఆర్ఐ ప్రశాంతి, సెక్రటరి రాధాకుమారి, గృహసారథుల జేసీఎస్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, వైఎస్సార్ సీపీ పెనుమాక కన్వీనర్ మేకా దామేష్‌రెడ్డి, బొక్కా నాని, భుజంగరావు, అన్నూరి సుబ్బారావు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిలో....

తాడేపల్లి పట్టణ పరిధిలోని 4వ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, గృహసారథుల పట్టణ జేసీఎస్ కన్వీనర్ ఈదులమూడి డేవిడ్‌రాజు, వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామి రెడ్డి అర్హులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

మేడికొండూరు: జగనన్న ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సరైన సమయంలో అందుతున్నాయని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ పరిశీలకులు, ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. మేడికొండూరు మండలం సిరిపురం గ్రామంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ప్రతి గడపకు తిరుగుతూ ఎవరికి ఏఏ పథకాలు వచ్చాయి, ఇంకా ఎవరికి అందాల్సి ఉందో గుర్తిస్తున్నారన్నారు. అధికారుల ద్వారా సంక్షేమ ఫలాలు అందిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీఎం వై.ఎస్.జగన్ అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. ఏ ఒక్కరూ మాకు ప్రభుత్వ పథకం అందలేదని చెప్పకుండా ఉండేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజకుమారి, ఎంపీపీ స్వప్నరాజేష్, తహసీల్దారు శ్రీనివాస శర్మ, సర్పంచ్ కె.త్రివేణి, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించేందుకే జగనన్న సురక్ష

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా



మహిళకు ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా

తాడికొండ: అర్హత ఉండి సంక్షేమం దరిచేరని వారు ఎవరైనా ఉంటే వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన జగనన్న సురక్ష కార్యక్రమం ప్రజల మన్ననలు పొందుతుందని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అన్నారు. తుళ్లూరు మండలం బోరుపాలెం, లింగాయపాలెం గ్రామాలలో మంగళవారం కొనసాగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వమే ప్రతి ఇంటికీ వచ్చి వారి అవసరాలను తెలుసుకొని జనన, మరణ, కుల, ఆదాయ, ధృవీకరణ సర్టిఫికెట్లు, సంక్షేమ పథకాలు అందని వారికి ఆ క్షణంలోనే అందేలా చర్యలు తీసుకోవడం వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల్లో జగనన్న ప్రభుత్వంపై విశ్వాసం పెంపొందిందని తెలిపారు. దేశంలోనే అత్యుత్తమ సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నకు నెంబర్ వన్‌గా పేరు వచ్చిందనే అక్కసుతోనే ప్రతిపక్ష పార్టీల నాయకులు అక్కసు ప్రదర్శిస్తున్నారన్నారు. పలువురికి జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాదల మహేంద్ర, జేసీఎస్ మండల కన్వీనర్ బండి స్టాలిన్, కొప్పుల శేషగిరిరావు, చనుమోలు రామారావు, తోకల రాఘవ, డీజే శ్రీను, ఐనవోలు చంటి, కలపాల ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఆపద్బాంధవులు వలంటీర్లు



గుండిమెడ క్వారంటైన్‌లో ఉన్న వారికి సేవలు అందిస్తున్న వలంటీర్లు, అధికారులు, ఏఎన్‌ఎంలు(ఫైల్)

- కరోనా సమయంలో విశేష సేవలు
- ప్రజల మన్ననలు పొందిన వైనం

తాడేపల్లిరూరల్: ఆపదల్లో ఉన్నవారిని ఆదుకున్నది వలంటర్లే. వారి సేవలకు ప్రజలు నీరాజనాలు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చింది. అనంతరం 2020లో కరోనా రావడంతో వారు ప్రజలకు అధికారులతో కలసి ఎనలేని సేవలు అందించారు. కరోనా బారిన పడిన ఎంతో మందిని దగ్గరుండి మరీ 108ల్లో ఆసుపత్రులకు పంపించి వారి నివాసంలోని వారి వివరాలను తీసుకుని, ఏఎన్ఎంలతో వెళ్లి కరోనా పరీక్షలు నిర్వహించి క్వారంటైన్‌లో ఉన్న 18 రోజులపాటు వారి అవసరాలను గుర్తించి అధికారులతో మాట్లాడి బియ్యం, కూరగాయలు ఇంటికి తీసుకు వెళ్లి అందజేసిన వలంటీర్లు. అంతేకాకుండా సంక్షేమ పథకాలు అందించడంలోను వారు ముందుండి సేవలు అందించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఉదయం 5 గంటలకే తలుపుతట్టి పెన్షన్లు అందజేస్తున్నారు. అటువంటి వారిపై రాజకీయం చేయడం తగదని ముక్తకంఠంతో వ్యాఖ్యానిస్తున్నారు.



తాడేపల్లిలో ఓ మహిళ మృతదేహానికి అంత్యక్రియలు చేస్తున్న వలంటీర్లు(ఫైల్)

మా యోగక్షేమాలు చూశారు..



నా భర్త కరీముల్లా దుబాయ్ నుంచి వచ్చిన సమయంలో కరోనా సోకింది. సమాచారం అందుకున్న వలంటీర్ అవినాష్ మా ఇంటికి వచ్చి మేమున్నామంటూ ధైర్యం చెప్పి అధికారులకు సమాచారం ఇచ్చి 108 ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. నా భర్త ఆసుపత్రి నుంచి తిరిగి వచ్చేవరకు మా ఇంటికి వచ్చి వలంటీర్ మా యోగక్షేమాలు తెలుసుకుని సేవలు అందించారు. నా భర్త ఇంటికి వచ్చిన తరువాత ప్రభుత్వం ఇచ్చిన నగదును మా ఇంటికి వచ్చి అవినాష్ అందజేశాడు.

– ముస్తఫాబీ, నులకపేట

మహిళా వలంటీర్ల సేవలు అమోఘం



కరోనా సమయంలో మహిళా వలంటీర్ల సేవలు అమోఘం. ఇంటింటికి తిరిగి పేదల ఇళ్లల్లో ఏం అవసరమో అడిగి తెలుసుకుని అధికారుల దృష్టికి తీసుకువెళ్లి అవసరమైన వంట సరుకులను అందజేశారు. మా ఇంటి పక్కన నివసించే ఓ వ్యక్తికి కరోనా రావడంతో అతను ఆక్సిజన్ లెవల్ పడిపోయాయి. సమాచారం అందుకున్న మా వలంటీర్ సిగిరిశెట్టి అనూష వారి ఇంటికి వచ్చి ప్రత్యేకమైన దుస్తులు ధరించి అతడ్ని ఇంట్లో నుంచి బయటకు తీసుకు వచ్చి ఆసుపత్రికి తీసుకువెళ్లింది. వారి ఇంట్లో వారికి సేవలు అందించారు.

–గూడూరు మల్లేశ్వరి, ఉండవల్లి

డెలివరీ బోయ్‌లపై కేసు

గుంటూరు ఈస్ట్ :డెలివరీ బోయ్‌లు సంస్థను మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చుట్టుగుంట సమీపంలో షాడో ఫ్యాక్స్ పేరుతో ఫిల్ప్‌కార్ట్ డెలివరీ సంస్థ నిర్వహిస్తున్నారు. డెలివరీ బోయ్‌లుగా పనిచేసే మనోజ్ రెడ్డి, విజయ ఆనందరాజు కస్టమర్లు రిటన్ చేసిన వస్తువులను సంస్థకు అప్పగించకుండా వాటి స్థానంలో రాళ్లు, సబ్బులు పెట్టి ప్యాక్ చేసి సంస్థకు అప్పగించేవారు.

సుమారు 500 వస్తువులను ఆ విధంగా మోసపూరితంగా రిటన్ చేశారు. వాటి విలువ రూ.5 లక్షలు ఉంటుందని ప్రాథమికంగా నిర్ధారించారు. సంస్థ ప్రతినిధి రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆక్రమణలు తొలగింపు



నెహ్రూనగర్: స్థానిక నెహ్రూనగర్ 11వ లైన్ న్యూ గుంటూరు రైల్వే స్టేషన్‌లో రోడ్డులో ఆక్రమించుకుని నివాసం ఉంటున్న వారిని నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు తొలగించారు. గత 40 ఏళ్ల తరబడి సదరు ప్రాంతంలో నివాసం ఉంటున్న వారి వెనుక స్థలంలో స్థల యాజమానులు ఇల్లు నిర్మించుకునేందుకుగాను స్థలం ముందు అడ్డుగా ఉన్న ఆక్రమణలు తొలగించాలని హై కోర్టును ఆశ్రయించారు. హైకోర్టు స్థలానికి ముందు ఉన్న ఆక్రమణలు తొలగించాలని ఉత్తర్వులు ఇవ్వడంతో మంగళవారం పట్టణ ప్రణాళిక డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య ఆధ్వర్యంలో పోలీసు, ఫైర్ సిబ్బంది, మెడికల్ సిబ్బందితో కలసి రోడ్డుపై ఆక్రమించుకుని నివాసం ఉంటున్న నాలుగు ఇళ్లను కూల్చి వేశారు.

పవన్ వ్యాఖ్యలపై వలంటీర్ల ఆగ్రహం

పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం



పెదవడ్లపూడిలో పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

మంగళగిరి: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై నియోజకవర్గ వ్యాప్తంగా వలంటీర్లు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం నగర పరిధిలోని నూతక్కి, పెదవడ్లపూడి ప్రాంతాల్లో వలంటీర్లు పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. తొలుత నూతక్కిలో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మకు చెప్పుల దండ వేసి ఊరేగించి అనంతరం సెంటర్‌లో దహనం చేశారు. పలువురు వలంటీర్లు మాట్లాడుతూ జీతాల కోసం కాకుండా సేవాభావంతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. తమ మనోభావాలు దెబ్బతీసేలా పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించడం సిగ్గు చేటన్నారు. కోవిడ్ బారిన పడిన వారిని కుటుంబసభ్యులు, బంధువులు సైతం తాకేందుకు భయపడినా తాము ప్రాణాలు ఒడ్డి ఎందరో ప్రాణాలను కాపాడామన్నారు. ఇప్పటికైనా భేషరతుగా క్షమాపణ చెప్పాలని, లేదంటే మరింత పెద్దఎత్తున ఆందోళన నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు గోళ్ల వెంకటరెడ్డి, పిడమర్తి రవికిరణ్, పులి సువర్ణరాజు, బొడ్డపాటి యుగంధర్‌రెడ్డి, పేర్ల వెంకటేష్, మనోజ్, తుమ్మపూడి కుసుమ, షేక్ మీరాబీ, సవేరీ భాయ్, కృష్ణవేణి, కందుల మల్లేశ్వరి, భాను భాయ్, బొక్కా అగస్టీన్, సెల్వం కుమార్, ఈడే మహేష్, కొడవర్తి శ్రీకాంత్ నాయక్, బొమ్మినేని శ్రీనివాస్, మనం అనిల్, నూతలపాటి వంశీ, పిడుగు కళ్యాణ్, గోచిపాతల రాజేష్, మందపాటి హృదయరాజు, శివనాయక్, చిట్టిబొమ్మ అనూష, ప్రియదర్శినిలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలించిన ఎమ్మెల్యే



యర్రబాలెంలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే మంగళవారం యర్రబాలెంలో పర్యటించి పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. తొలుత యర్రబాలెం చెరువు కట్ట వద్ద నుంచి పాగాకు కంపెనీ వరకూ రూ.1.87 కోట్లతో చేపట్టిన సీసీ డ్రెయిన్ పనులను పరిశీలించారు. రూ.1.04 కోట్లతో చేపట్టనున్న బీటీ రహదారి నిర్మాణ పనులకు సంబంధించి ఇటీవల అధికారులు వేసిన మార్కింగ్‌ను పరిశీలించారు. నివాసాలు ఖాళీ చేయాలని స్థానిక అధికారులు తెలియజేశారని, ప్రత్యామ్నాయం చూపాలని పలువురు పేదలు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించారు. ఇళ్ల స్థలాలు రాని వారికి తప్పకుండా న్యాయం చేస్తామని, బీటీ రహదారి నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే కోరారు. అనంతరం బసవతారక నగర్‌కు చేరుకుని ఇటీవల రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రహదారి పనులను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి స్థానికులు ఎమ్మెల్యే ఆర్కే దృష్టికి తీసుకురాగా సీసీ రోడ్డుకు అనుసంధానంగా సిమెంటు తూములు ఏర్పాటు చేసి గ్రావెల్ తోలించి అప్రోచ్ రోడ్డు పనులను చేపట్టాలని నగరపాలక సంస్థ అధికారులకు సూచించారు.

వాట్సాప్ సందేశానికి స్పందించిన ఆర్కే

ఇటీవల కురిసిన వర్షాలకు తమ ప్రాంతం ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని వాట్సాప్ ద్వారా సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆర్కే వెంటనే స్పందించి సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. నగర పాలక సంస్థ పరిధిలోని రత్నాల చెరువు ఎస్టీ కాలనీ ప్రాంతం కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముంపునకు గురౌతుందని స్థానికులు ఎమ్మెల్యే ఆర్కేకు వాట్సాప్ ద్వారా మెసేజ్ చేశారు. మంగళవారం సదరు ప్రాంతాన్ని పరిశీలించి ముంపునకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు వివరించారు. వెంటనే ప్రొక్లెయిన్ తెప్పించి మురుగు కాలువ పూడికతీత పనులను చేపట్టాలని సూచించారు. ఎమ్మెల్యే స్పందన పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో నగర పాలక సంస్థ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ

మేయర్ కావటి



నెహ్రూనగర్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దినట్లు నగర మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు అన్నారు. గుంటూరు నగరంలోని ఆర్.అగ్రహారంలోని కావటి శంకరరావు మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌లో రూ.1.39 కోట్లతో మన బడి- నాడు నేడు పథకం కింద నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని తనిఖీ చేశారు. మేయర్ మాట్లాడుతూ నిర్మాణ పనులలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పనులను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుండాలని ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల జ్యోతి పద్మజ, నగర పాలక సంస్థ స్కూల్ సూపర్ వైజర్ శేషగిరి రావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస రెడ్డి, డీఈఈ రమేష్ బాబు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
90100 67114 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com